సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం। 29। నవంబర్। 2024



పీజీ స్పాట్ అడ్మిషన్లు నేడే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నిర్వహించనున్నారు. 315 సీట్లు ఖాళీగా ఉన్నాయి. - 8లో



దొంగల హల్‌చల్

కాశీబుగ్గలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. 10 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు మాయం చేశారు. - 8లో

పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన

సంతబొమ్మాళి : హల్దియా పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో పెట్రో కెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు మూలపేట, ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్ భూములు, మేఘవరం తంపర భూములను అధికారులు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఏపీఐఐసీ అధికారులు, మారిటైమ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పరిశ్రమల సర్వే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై ఈ నెల 29 నుంచి సర్వే ప్రారంభమవుతుందని జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు జె.ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 వరకు సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనికోసం ఎంఎస్ఎంఈ సర్వే, సపోర్ట్ అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వే ఫలితాల ఆధారంగా వివిధ రకాల ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని, యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

ఎస్పీకి హోంగార్డుల కృతజ్ఞతలు



ఎస్పీకి పూలకుండీ బహూకరిస్తున్న మహిళా హోంగార్డులు

శ్రీకాకుళం క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన సరుబుజ్జిలి హోంగార్డు రేవతికి మెరుగైన చికిత్స అందించడంలో ఔదార్యం కనబరిచిన ఎస్పీ మహేశ్వరరెడ్డికి మహిళా హోంగార్డు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి పూలకుండీ బహూకరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాలులో గురువారం వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ, సీఎస్ఈ ఇంజినీరింగ్ విద్యార్థులకు నెల రోజులు పాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టార్టప్‌లకు అవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. మారుతున్న సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. ఉన్నతి ఫౌండేషన్ ఛేంజ్‌మేకర్ బి.రంజిత్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాష నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ, జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు

● వణికిస్తున్న చలి



తుఫాన్ ప్రభావంతో జిల్లా వాసులను చలి వణికిస్తోంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతమైన పాతపట్నం, పరిసరప్రాంతాలలో నాలుగు రోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. ఐదు రోజు కిందట పాతపట్నంలో కనిష్ట ఉష్ణోగ్రత 18 డిగ్రీలు ఉండగా.. గురువారం నాటికి 11 డిగ్రీలకు తగ్గింది. దీంతో రాత్రులే కాకుండా పగలు కూడా చలికి వణుకుతున్నారు. శ్రీకాకుళం, సారవకోట మార్గమంతా మంచుతో కప్పేసి ఉండటంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా మంచు కురుస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం కాస్త ఎండ కాస్తున్నా సాయంత్రం 4 గంటలకే శీతల గాలులు వీస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. –పాతపట్నం



పాతపట్నంలో చలిమంట కాస్తున్న గిరిజనులు

● భయపెడుతున్న పులి



సంతబొమ్మాళి మండలంలోని హనుమంతునాయుడుపేట పంచాయతీ పెద్దకేశనాయుడుపేటలో పులి తిరుగుతోందంటూ ప్రచారం జరుగుతుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గుర్తు తెలియని జంతువు దాడిలో భద్రాచలం శాంతమూర్తికి చెందిన ఆవు గురువారం మృతి చెందడంతో స్థానికులు మరింతగా ఆందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 14 ఇంచీల పొడవు ఉన్న జంతువు పాదముద్రలు పెద్ద మగపులిగా భావిస్తున్నారు. ఈ మేరకు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తహసీల్దార్ ఆర్.రమేష్ కుమార్‌కు సమాచారం అందించి పరిసర ప్రాంత గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఫారెస్ట్ రేంజర్ జి.జగదీశ్వర్, నౌపడ ఎస్సై జి.నారాయణస్వామి, ఏసీఎఫ్ ఎ.వి.నాగేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జనప్రియ, ఎఫ్ఎస్ఓ నరేంద్ర, వెటర్నరీ డాక్టర్ అప్పలసూరి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఒడిశా నుంచి మందస మండలం మీదుగా సంతబొమ్మాళి మండలంలోకి పులి చేరుకుందని కాశీబుగ్గ ఫారెస్టు అధికారి మురళీకృష్ణ తెలిపారు. –సంతబొమ్మాళి



పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, పోలీసులు



మృతి చెందిన ఆవు

ఎన్నికా.. ఏకగ్రీవమా?

మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు వాసు మరోసారి కొనసాగకూడదు. ఈ సారి తప్పకుండా మార్చాల్సిందే. మన అనుకున్నోళ్లే అధ్యక్షుడిగా ఉండాలి. అది కూడా ఏకగ్రీవంగా జరిగిపోవాలి.

–జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంతంగా నడుస్తున్న టాక్.

మంచి చేస్తున్న వాను మాత్రమే ఉండాలి. మరొకరికి అవకాశమిస్తే నష్టమే. గతంలో ఇద్దరు చేశారు. ఏం జరిగిందో చూశాం. మళ్లీ ఆ ఇబ్బందులు రాకూడదు. అవసరమైతే ఎన్నికలకై నా వెళ్తాం.

– మెజారిటీ మిల్లర్ల అభిప్రాయం

అవకాశమిస్తే చేస్తాను. ఇన్నాళ్లూ చేతనైనంత చేశాను. పదవి కోసం పాకులాడను. రాజకీయం చేయాలనుకోను. సభ్యులు తీసుకునే నిర్ణయం మేరకు నడుచుకుంటాను.

– ప్రస్తుత అధ్యక్షుడు వాసు ఆలోచన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :



- మిల్లర్ల సంఘం ఎన్నికపై ప్రతిష్టంభన
- ప్రస్తుత అధ్యక్షుడు వానును మార్చాలని మంత్రి అచ్చెన్న పంతం!
- వానుపైనే మొగ్గు చూపుతున్న మెజారిటీ సభ్యులు
- ఒత్తిడి చేస్తే ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్న పరిస్థితి
- ఏకాభిప్రాయం కుదరక ఎన్నిక తాత్సారం

జిల్లా మిల్లర్ల సంఘం కార్యవర్గం ఎన్నికపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రతి సారీ నాలుగ్గోడల మధ్య సభ్యుల ఏకాభిప్రాయంతో జరిగిపోయే ఎన్నికకు ఈ సారి రాజకీయ రంగు పులుముకుంది. దీంతో ఇటీవల జరగాల్సిన ఎన్నిక వాయిదా పడిపోయింది. మంత్రి అచ్చెన్నాయుడు ఆలోచన ఒకటైతే.. మిల్లర్ల అభిప్రాయం మరొకటి కావడంతో ఏకాభిప్రాయం కుదరలేదు.

మిల్లర్ల సంఘంలో రాజకీయ జోక్యం..

ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వంతో కలిసిపోయే కార్యవర్గం మిల్లర్లది. వారి కార్యకలాపాలు, సంఘం శ్రేయస్సు దృష్ట్యా ధాన్యం సేకరణ సమయంలో సమష్టిగా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంటారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో ముందుకు సాగుతుంటారు. అలాగని ఆయా పార్టీలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరగరు. వారి సంఘం అవసరాల దృష్ట్యా వెళ్తుంటారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతల మైండ్‌సెట్ మారింది. తటస్థ విధానం తమకొద్దు.. తమకు అనుకూలంగా ఉండే వారే కావాలని కోరుకుంటున్నారు. ఇప్పటికే అధికారుల పోస్టింగ్‌లు, సిబ్బంది బదిలీలు రాజకీయ కోణంలో జరిగాయి. తాజాగా మిల్లర్ల సంఘంలోనూ రాజకీయం ప్రవేశం ప్రవేశించింది. ముఖ్యంగా జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి పడింది. తన మనసులో మాటను బహిరంగంగా చెప్పకుండా, అనుయాయులు, తోటి మిల్లర్ల ద్వారా తన ఆలోచనను తెలియజేశారు. మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా వాసు ఉండకూడదు. అనుకూలమైన వ్యక్తే ఆ పదవిలో ఉండాలని కోరుకుంటున్నారు. ఆందుకు తగ్గట్టుగా పావులు కదుపుతున్నారు.

మంత్రికి కలిసి రాని పరిస్థితులు

మంత్రిగా తన మనసులో ఒకటున్నా.. తాను అనుకున్నదే జరగాలని భావిస్తున్నా పరిస్థితులు అంతగా అనుకూలంగా కన్పించడం లేదు. దీనికంతటికీ ప్రస్తుత అధ్యక్షుడు వాసుపై అత్యధిక మిల్లర్లకు ఉన్న నమ్మకమే కారణం. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు తమకు కావల్సిన వారిని అధ్యక్షులుగా ఎంపిక చేసినా సంఘానికి మేలు జరగలేదు. బోయిన రమేష్, తంగుడు జోగారావు తదితర వ్యక్తులు అధ్యక్షులుగా చేసిన కాలంలో న్యాయం జరగలేదన్న అసంతృప్తి మిల్లర్లలో ఉంది. అందుకే సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు వద్దని చెబుతున్నా మెజారిటీ మిల్లర్లపై వాసు వైపే మొగ్గుచూపుతున్నారు. ఆ నమ్మకానికి వాసు పనితనమే కారణం. 2014–19మధ్య మిల్లర్ల ఖాతాలో జమ కావల్సిన రూ.16కోట్ల ధాన్యం రవాణా చార్జీలను న్యాయస్థానాన్ని ఆశ్రయించి సాధించుకోగలిగారు. అలాగే, మిలర్ల సంఘం కోసం శ్రీకాకుళంలో ప్రత్యేక భవనాన్ని నిర్మించి, తమకొక అడ్రస్సు ఏర్పాటు చేశారు. ఇలా చెప్పుకునిపోతే వాసు ఖాతాలో అనేక విజయాలు ఉన్నాయి. అలాగే అధ్యక్షులుగా పనిచేసిన మరికొందరి సమయంలో పడిన ఇబ్బందులు మిల్లర్లు మరిచిపోలేకపోతున్నారు. దీంతో వాసే కావాలని మెజారిటీ మిల్లర్లు కోరుకుంటున్నారు. దీంతో ఏకగ్రీవంగా మిల్లర్ల సంఘం అధ్యక్ష ఎన్నికకు ఆస్కారం లేకుండాపోయింది. మంత్రి పంతానికి తగ్గట్టుగా లైన్ క్లియర్ కాలేదు.

ఎన్నికకు వెళ్తే..

జిల్లాలో 330 మంది వరకు మిల్లర్లు ఉన్నారు. వాసును మార్చాలని మంత్రి పట్టుబడితే ఎన్నికలకు వెళ్దామనే ఆలోచనలో మిల్లర్లు ఉన్నారు. ప్రస్తుత సమీకరణాలు ప్రకారం మెజారిటీ మిల్లర్లు వాసు వైపే ఉన్నారు. కోటబొమ్మాళి, నరసన్నపేటకు చెందిన కొంతమంది వ్యతిరేకంగా ఉన్నా వారంతా ప్రభావం చూపే పరిస్థితి లేదు. దీంతో మంత్రి పేరుతో ఎవరైనా బరిలో ఉన్నా గెలిచే అవకాశాలు తక్కువే. ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పంతానికి పోయి, స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగా బెదిరింపులకు దిగితే చెప్పం లేం గాని.. ఆ పరిస్థితులు చోటు చేసుకోకుండా ఎన్నికలు జరిగితే మాత్రం వాసుకే విజయావకాశాలు ఎక్కువ. దీంతో కూటమి నేతలు కూడా ఆలోచనలో పడ్డారు. ఎన్నికలకు వెళ్లి ఓడిపోయి అప్రతిష్ట, వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందని తర్జనభర్జన పడుతున్నారు. ఇదే సందర్భంలో వాసును మెజారిటీ మిల్లర్లు కోరుకుంటున్నప్పటికీ ఆ పదవిపై ఆయన కూడా అంత పట్టుదలతో ఉండటం లేదు. రాజకీయంగా పోటీ పడాలనో..ఏదో ఒకటి చేసి గెలవాలనో ప్రయత్నించడం లేదు. సభ్యులు అవకాశమిస్తే చేస్తాను.. లేకుంటే సభ్యుడిగా కొనసాగుతాననే అభిప్రాయంతోనే ఉన్నారు.

ఫెంగల్ అలర్ట్



● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



శ్రీకాకుళం పాతబస్టాండ్: అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయనే అంచనాల నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు.

కంట్రోల్ రూమ్
ఫోన్ నంబర్
08942-240557

● పడిపోతున్న పైర్లు



నరసన్నపేట వద్ద నేలకొరిగిన వరి పైరు

నరసన్నపేట: మండలంలో గురువారం వేకువజాము నుంచి గాలుల తీవ్రత పెరగడంతో వరి పైర్లు నేలకొరుగుతున్నాయి. సత్యవరం, నరసన్నపేట, ఉర్లాం, బడ్డవానిపేట, బాలసీమ గ్రామాల్లో వరి పొలాలు ఒరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తయిన చోట్ల వరికుప్పలు పెట్టే పనిలో నిమగ్నమవుతున్నారు.

● వేటకు విరామం



చిన్నకర్రివానిపాలెం తీరంలో బోటును ఒడ్డుకు చేరుస్తున్న గంగపుత్రులు

కవిటి: తుఫాన్ హెచ్చరికలతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ముందస్తు జాగ్రత్తగా వేటకు విరామం ప్రకటించి బోట్లు, వలలను సురక్షిత ప్రదేశాల్లో భద్రపరుచుకోవడంలో నిమగ్నమయ్యారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో రెండు రోజులుగా మత్స్యకారులంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

సరుబుజ్జిలి: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఇబ్బందులకు గురి చేయవద్దని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. సరుబుజ్జిలి మండలం సింధువాడ, చిగురువలస, షళంత్రి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని నచ్చిన మిల్లులకు తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాలరావు, తహసీల్దార్ ఎల్.మధుసూదన, వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం, సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.



సింధువాడ కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సీఎస్‌డీఎంగా వేణుగోపాల్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్(సీఎస్‌డీఎం)గా టి.వేణుగోపాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో అడిషనల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.





జీ(వి)తం ఇంతేనా..?

- ఐదు నెలలుగా ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు అందని వేతనాలు
- ఎలా బతకాలని ప్రశ్నిస్తున్న చిరుద్యోగులు
- జిల్లా వ్యాప్తంగా 2576 మంది ఆయాలు, 296 మంది నైట్ వాచ్‌మెన్లు

ఎలా బతకాలి



మేము రెక్కల కష్టం మీద జీవిస్తున్నాం. నెలనెలా వచ్చే వేతనమే మాకు జీవనాధారం. అలాంటిది నెలల తరబడి ఇవ్వకపోతే మేం ఎలా జీవించేది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ స్కూల్స్‌లోనే ఉంటున్నాం. మరే పనికి వెళ్లలేక పోతున్నాం. ఇదే జీవనాధారం. వేతనబకాయిలు వెంటనే చెల్లించాలి. మాకు యూనియన్ లేక పోవడంతో మా తరపున ప్రశ్నించే వారు, విజ్ఞప్తి చేసేవారు ఎవరూ లేరు. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– చిన్నమ్మడు, దేశవానిపేట స్కూల్ ఆయా

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిరుద్యోగుల పరిస్థితి దినదిన గండంగా మారింది. కొందరు ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా అందకపోగా మరి కొందరికి ఉద్యోగాలే ఉండటం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా చిరుద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్‌మెన్లు ఆకలితో అలమటిస్తున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో అప్పులపాలవుతున్నారు. మరో వైపు పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఐదు నెలలుగా ప్రభుత్వం వీరికి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదు నెలలుగా వేతనాలు రాక పోతే ఎలా జీవించాలని ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభించినప్పటి నుంచీ వేతనాలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ఒక్కొక్కరికి రూ.30వేలు బకాయిలు

స్కూల్స్‌లో టాయిలెట్లు, వాష్ బేసిన్లు పరిశుభ్రంగా లేకుంటే విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారని భావించి గత ప్రభుత్వం స్కూళ్లలో ఆయాలను నియమించింది. అలాగే ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను కూడా కాపలా కోసం పెట్టారు. వీరిని ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు గౌరవ వేతనంగా నిర్ణయించారు. ఆ మేరకు గత ప్రభుత్వ కాలంలో సక్రమంగా వేతనాలు వచ్చేవి. ప్రభుత్వం మారిన తర్వాత పరిస్థితి మారింది. ఇప్పటి వరకూ ఆయాలకు, నైట్ వాచ్‌మెన్లకు వేతనాలు రాలేదు. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. జూన్ నుంచి అక్టోబరు వరకూ వీరికి ఒక్కొక్కరికీ రూ.30 వేలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. వేతనాలు రాకపోయినా ఆయాలు, నైట్‌వాచ్‌మెన్లు వారి విధులను సక్రమంగా నిర్వహిస్తుండడం గమనార్హం. ప్రధానంగా స్కూల్ పరిసరాలు క్లీన్‌గా ఉంచుతున్నారు. వీరికి వేతనాలు చెల్లించక పోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయాలు, నైట్‌వాచ్‌మెన్లు కోరుతున్నారు.



వేతన బకాయిలు చెల్లించాలని కోరుతున్న ఆయాలు

రూ. 1.72 కోట్లు బకాయిలు..

జిల్లాలో 3046 స్కూల్స్ ఉండగా 2576 మంది ఆయాలు, 296 మంది నైట్‌వాచ్‌మెన్లు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఐదు నెలల వేతనం రూ. 30 వేలు చొప్పున రూ.1.72 కోట్లు ప్రభుత్వం బకాయి పడి ఉంది. ఈ మేరకు బడ్జెట్ రాకపోవడంతో పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణ కింద పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూలే విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



రాష్ట్రంలో రాక్షస పాలన

- దాడులకు ప్రతిదాడి తప్పదు
- మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్ ధ్వజం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి నిరంతరం దాడులు, కక్షసాధింపులు, పగలు ప్రతీకారాలు తీర్చుకునే పనిలోనే కూటమి ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. ఆరాచక పాలన సాగిస్తే ప్రజలు హర్షించరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పొన్నాడ వంతెన వద్ద ఉన్న పూలే పార్కులో కృష్ణదాస్ మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. బీసీలకు పెద్దపీట వేసి పూలే వంటి మహనీయుల ఆశయ సాధనకు నిరంతరం పరితపించిన నాయకుడు మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాజకీయాల్లో దాడులు చేయడం సరికాదని, దాడికి ప్రతిదాడి తప్పదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నిస్తే కేసులు బనాయించడం దారుణమన్నారు. ప్రజల గొంతునొక్కేయాలని చూస్తే ఎవ్వరు సహించరని, ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చి తీరాలని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించి జనరంజక పాలన అందించామని గుర్తు చేశారు. కూటమి సర్కారు వాటన్నింటిని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, సాధు వైకుంఠరావు, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎన్ని ధనుంజయరావు, ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, అంబటి శ్రీనివాసరావు, ఎం.వి.స్వరూప్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, గద్దిబోయిన కృష్ణయాదవ్, టి.కామేశ్వరి, ముంజేటి కృష్ణ, ఎం.ఏ.రఫీ, సిజు, ఎం.ఏ.బేగ్, సీహెచ్ భాస్కరరావు, గొండు కృష్ణ, అంధవరపు రమేష్, డి.పి.దేవ్, కర్నేన హరి, వానపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులతో మమేకమై..!



జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య విద్యార్థులతో మమేకమయ్యారు. జి.సిగడాం, సంతవురిటి బీసీ వసతి గృహాల్లో బుధవారం రాత్రి బస చేసి, గురువారం ఉదయం విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. బోధన, విద్యార్థులకు అందించే ఆహారం, హాస్టల్ పరిసరాలు, పరీక్షల ఫలితాలు అన్నింటిలోనూ హాస్టళ్లు అత్యుత్తమ స్థానంలో నిలుస్తున్నాయని కొనియాడారు. - జి.సిగడాం

క్లుప్తంగా

మరోసారి నేవీ సర్వే

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో నిర్మించనున్న కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి నేవీ బృందం గురువారం మరోసారి సర్వే చేపట్టింది. మందస, వజ్రపుకొత్తూరు సముద్రతీర ప్రాంతంలో శాటిలైట్ మెషీన్లు, వాకీటాకీలతో ద్విచక్రవాహనాలు, కాలినడకన, ఇతర వాహనాల్లో పరిశీలన జరిపారు. సముద్ర నీటి మట్టం, పడవ ప్రయాణం తీరుతెన్నులను పరిశీలించారు. సర్వే రిపోర్టు ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా గోపాలపూర్ నేవీ అధికారి డిల్లేశ్వరరావు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అంతా మోసమే



కంచిలి: కూటమి ప్రభుత్వంలో మంచి కరువైందని, అంతా మోసమేనని, కక్ష సాధింపు చర్యలు మాత్రమే చేపడుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి పాలనలో కుట్రలు, అరాచకం, దాడులు, దోపిడీ, అన్నింటా వైఫల్యాలేనని దుయ్యబట్టారు. హామీలు అమలు చేయకుండా దగా చేయడమే మంచి పాలనా అని ప్రశ్నించారు. రైతులు, మహిళలు, పిల్లలు, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాలకూ మోసం చేశారని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రోజంతా మద్యం అమ్మకాలు, ప్రైవేటు సిండికేట్లు, ఊరూరా యథేచ్ఛగా బెల్ట్ షాప్‌లతో అరాచక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

నాటుసారాతో ఒకరు అరెస్టు

సోంపేట: స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి 200 నాటుసారా ప్యాకెట్లుతో ఒక ముద్దాయిని అరెస్టు చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. మందస పరిధిలో బెల్లం విక్రయించే వ్యాపారులకు ముడి బెల్లంను విక్రయిస్తే చర్యలు తప్పవని నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. వివిధ కేసుల్లో అరెస్టైన 15 మంది ముద్దాయిలను మందస, కంచిలి మండల తహసీల్దార్ల సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

శ్రీకాకుళం న్యూకాలనీ: శిక్షణ పేరిట ఉపాధ్యాయులను వేధించడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని శ్రీ విశ్వ విజేత జూనియర్ కళాశాల వేదికగా కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సిరిపురం శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రంలో మానసిక ఒత్తిడి, ఆందోళన కారణంగా మృతిచెందడం బాధాకరమన్నారు. రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాల నిర్వహణపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలన్నారు. అనంతరం డీఈఓ ఎస్.తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్, పి.శ్రీరామ్మూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, కె.మురళీధర్, ఏవి శివరామకృష్ణ, పూజారి సూర్యనారాయణ, బివిఎస్ఎన్ మూర్తి, పూజారి ధనుంజయరావు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లోనే లీడర్షిప్ ట్రైనింగ్ జరపాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రాల్లోనే లీడర్షిప్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.





పీజీ స్పాట్ అడ్మిషన్లు నేడే



- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో 16 కోర్సులు
- మొత్తం సీట్లు 562.. ప్రవేశాలు జరిగినవి 247
- ఖాళీ సీట్లు 315

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా ప్రవేశాలు జరగలేదు. ఏపీ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ – 2024 ద్వారా రెండు విడతల్లో ప్రవేశాలు కల్పించారు. సెప్టెంబర్ మొదటి రెండు వారాల్లో ఈ ప్రవేశాలు కల్పించినా ఇంతవరకు తరగతులు ప్రారంభించ లేదు. మరో నెల రోజుల్లో మొదటి సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉండగా.. ఇప్పుడు ఉన్నత విద్యా మండలి స్పాట్ అడ్మిషన్ల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వర్సిటీలో శుక్రవారం తక్షణ ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్సిటీలో 16 కోర్సుల్లో 562 సీట్లు ఉన్నాయి. 247 ప్రవేశాలు జరిగాయి. 315 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండు విడతలు కౌన్సెలింగ్‌లో, సెట్ అర్హత ద్వారా నిర్వహించిన స్పాట్ ప్రవేశాల్లో కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం మరోసారి కౌన్సెలింగ్‌ను సెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సైన్స్ కోర్సుల్లో మాత్రమే మెరుగైన ప్రవేశాలు జరిగాయి. కొన్ని కోర్సుల్లో కనీస స్థాయిలోనూ ప్రవేశాలు జరగలేదు. వాస్తవానికి 50 శాతం ప్రవేశాలు ఉంటేనే కోర్సుల నిర్వహణ సాధ్యం. 40 మంది విద్యార్థులు ఉంటే కోర్సుల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు ఐదుగురు అర్హులైన బోధకులు ఉండాలి. నిర్వహన ఖర్చు నెలకు రూ.లక్షల్లో ఉంటుంది. ఇక్కడ మాత్రం విద్యార్థులు కనీస స్థాయిలో లేకపోవడంతో లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయి. కాగా, స్పాట్ ప్రవేశాల విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి రెగ్యులర్ విద్యార్థులతో కలిసి పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు శుక్రవారం పీజీ మిగులు సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తాం. డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు ప్రక్రియ నిర్వహిస్తాం. ఉన్నత విద్యా మండలి నిబంధనలు మేరకు ప్రవేశాలు కల్పిస్తాం.

– పి.సుజాత, రిజిస్ట్రార్

ఈ ఏడాది ప్రవేశాలు...

కోర్సు	సీట్లు	ప్రవేశాలు జరిగిన సీట్లు
ఇంగ్లిష్	40	29
తెలుగు	40	07
సోషల్ వర్కు	40	05
జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్	30	05
ఎంఎల్ఐఎస్సీ	40	07
రూరల్ డెవలప్‌మెంట్	40	07
ఎకనామిక్స్	40	05
ఎం.కాం	40	38
ఎంఈడీ	40	11
బయోటెక్నాలజీ	33	30
మైక్రో బయోలజీ	22	20
అప్లైడ్ మ్యాథ్స్	22	06
మ్యాథ్స్	40	06
ఫిజిక్స్	40	17
ఎనలాటికల్ కెమిస్ట్రీ	22	21
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	33

ప్రభుత్వ రాయతీలు వర్తించవు...

స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ రాయతీలు వర్తించవు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మంజూరు కావు. ట్యూషన్ ఫీజు, వసతి గృహం ఫీజు, పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆర్ట్సు, సైన్స్, కామర్స్ ఇలా కోర్సు బట్టి రూ.7500 నుంచి రూ.40 వేల వరకు ఫీజు స్ట్రక్చర్ ఉంది.

మర్యాదపూర్వక భేటీ



మాజీ సీఎం జగన్‌తో చింతాడ రవికుమార్ తదితరులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ విజయవాడలో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని జగన్ సూచించినట్లు రవికుమార్ తెలిపారు. ఆయనతో పాటు సరుబుజ్జిలి జెడ్పీటీసీ ఎస్.నాగేశ్వరరావు, పొందూరు జెడ్పీటీసీ ఎల్.కాంతారావు, బూర్జ ఎంపీపీ కె.నాగేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు కె.గోవిందరావు తదితరులు ఉన్నారు.

షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం



కాలిబూడిదైన షాపింగ్ మాల్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డులో ఉన్నటువంటి జాస్మిన్ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున ఆరుబయట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలి విద్యుత్ వైర్లు నుంచి మంటలు చెలరేగడంతో షాపింగ్ మాల్‌లో క్యాష్ కౌంటర్ వద్ద మంటలు అంటుకున్నాయి. అద్దాలతో పాటు, ఇనుప షట్టర్ వేసి ఉండడంతో ఓపెన్ చేసేలోగా అగ్ని ప్రమాదం జరిగిపోయింది. విద్యుత్‌తో నడిచే డోర్లు, షట్టర్లు కావడంతో మ్యానువల్‌గా తెరుచుకోవడానికి గంటల సమయం పట్టింది. అప్పటికే షాపింగ్ మాల్ వద్దకు పలాస అగ్నిమాపక సిబ్బంది చేరుకుని అద్దాలను పగలుగొట్టి లోపలకు ప్రవేశించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. కానీ అదుపు చేయడం కష్టమై మందస మండలం అగ్నిమాపక శకటం తోడవడంతో సుమారు పదకొండు గంటలకు అదుపు చేయగలిగారు. మంటలు ఇతర షాపులకు అంటుకుంటాయని స్థానికులు ఆందోళనకు గురై భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో బట్టల షాపులోని ఖరీదైన వస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లిందని విజయనగరానికి చెందిన యజమాని ఉప్పు మయూర్ తెలిపారు.

రాష్ట్రంలో బడుగులపై దాడులు



టెక్కలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనివిధంగా బడుగు, బలహీన వర్గాలపై మితిమీరిన దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. గురువారం టెక్కలిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో అబద్ధాలు చెప్పి కూటమి ప్రభుత్వం అధికారం దక్కించుకుందన్నారు. పథకాలు అమలు చేయకపోగా, ప్రశ్నించిన వారిపై దాడులు, కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. మరోవైపు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలో వ్యవసాయం, పాడి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పూర్తిగా విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోయారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటివరకు కేంద్రాలు తెరవకుండా దళారులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం, పాడి సంపద ఎంతో వైభవంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యానికి గురవుతున్నాయని మండిపడ్డారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంపై ప్రజలంతా అప్పుడే విస్తుపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకొని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. ఆయనతో పాటు టెక్కలి, నందిగాం ఎంపీపీలు ఆట్ల సరోజనమ్మ, నడుపూరు శ్రీరామ్మూర్తి, కోట బొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మత్స్యకారుడు మృతి

గార: మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన వాసుపల్లి అప్పయ్య (58) వేటకు వెళ్లి మృతి చెందాడు. బుధవారం ఉదయం వేటకు వెళ్లి చీకటిపడుతున్నా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం కూడా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. చివరకు గ్రామ సమీపంలోని ఉప్పుగెడ్డపై మృతదేహం తేలింది. కుమారుడు అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జనార్ధన తెలిపారు.


మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లేపల్లిగూడ గిరిజన గ్రామంలో మతిస్థిమితం లేని వృద్ధుడు శివకోల రమణయ్య (94) బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈయన స్వగ్రామం సరుబుజ్జిలి మండలం కొత్తకోట. రెండు రోజుల కిందట కొత్తకోటలోని పెద్ద చెరువు మీదుగా బూర్జ మండలం వైకుంఠపురం వైపు వెళ్లాడు. అదే మండలంలోని అల్లేపల్లిగూడ కొండ దిగువున పొదల్లో పడి మృతి చెందాడు. ఇతని కుమారుడు 8 నెలల కిందట మృతి చెందాడు. కుమార్తెలకు వివాహమైంది. గ్రామంలో ఒక్కడే ఉండేవాడు. ఐదేళ్ల కిందట హిరమండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పాడలి–దుగ్గుపురం నుంచి కొత్తకోట వలస వచ్చాడు. కుమార్తె కె.ప్రమీళ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవళ్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులో చోరీ



దొంగతనం జరిగిన గది

ఎల్.ఎన్.పేట: మండలంలోని ధనుకువాడ రోడ్డులో ఉన్న కల్కి కామాక్షి రైస్ మిల్లులో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఆఫీసు గది తాళాలు పగలు గొట్టి కంప్యూటర్, ఇతర పరికరాలను పట్టుకుపోయారు. మిల్లు యజమాని వూర్ల సురేష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరుబుజ్జిలి ఎస్సై ఎస్.బాలరాజు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆళ్ల శ్రీనివాసరావు (ఫైల్)

పాతపట్నం: స్థానిక యశోదనగర్‌కు చెందిన ఆళ్ల శ్రీనివాసరావు గురువారం సాయంత్రం అంతరాబ రోడ్డు స్టూడెంట్ కాలనీలోని ఒక ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీనివాసరావు(38) వ్యాపారం కోసం పాతపట్నంకు ఆరు సంవత్సరాల క్రితం వచ్చి, యశోదనగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఈయన గతంలో సెయింటెన్స్ స్కూల్ ఎదురుగా ఫర్నీచర్ దుకాణం నిర్వహించాడు. ఇటీవల కాలంలో వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులబారిన పడినట్లు కుటుంబీకులు తెలిపారు. గురువారం సాయంత్రం అంతరాబ స్టూడెంట్ కాలనీలోని ఒక ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. సంఘటన స్థలానికి సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్యలు చేరుకుని మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య స్వాతి, బాబు కార్తీక్, పాప మౌనికలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి



మణికంఠ(ఫైల్)

కంచిలి: స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో వంట పనిచేస్తున్న చింతల త్రినాథ్, సుజాతల రెండో కుమారుడు లింగరాజు అలియాస్ మణికంఠ(23) గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు మణికంఠ తన స్నేహితుడు నొళియా రుషికేష్‌తో కలిసి బుధవారం రాత్రి కంచిలిలో ఒక దాబాలో భోంచేసి ఇచ్ఛాపురంలో సినిమాకు వెళ్లారు. అక్కడ నుంచి అర్ధరాత్రి ఒంటి గంటకు బయల్దేరి బుల్లెట్ వాహనంపై వస్తుండగా మండలంలోని జాడుపూడి కాలనీ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పింది. దీంతో వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో బండి నడుపుతున్న లింగరాజు అలియాస్ మణికంఠకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక కూర్చున్న రుషికేష్ ఎగిరిపడి రోడ్డు మీద పడినప్పటికీ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న హైవే అంబులెన్స్ వాహనం హుటాహుటిన అక్కడికి చేరుకొని మణికంఠ మృతదేహం, గాయాలపాలైన రుషికేష్‌ను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మణికంఠ మృతదేహానికి గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. రుషికేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

విదేశాలకు వెళ్లాల్సి ఉండగా...

మృతుడు మణికంఠం డిసెంబర్ 7వ తేదీన మలేషియా వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. దీంతో ఈ కొద్దిరోజులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడుపుదామని భావించాడు. ఆ విధంగానే ఒకవైపు క్యాంప్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసుకొని, మరోవైపు సరదాగా గడుపుతున్న క్షణాల్లో ఈ విధంగా ప్రమాదం జరిగింది. అందివచ్చిన కుమారుడు అందరినీ విడిచి విగతజీవుడైన పరిస్థితిని చూసి తల్లి సుజాత, తండ్రి త్రినాథ్, మిగతా కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. మృతుడు ఇంతకు ముందు కూడా విదేశంలో ఉద్యోగం చేసి వచ్చి, కొన్నాళ్లు కుటుంబంతో గడిపి, మళ్లీ ఉద్యోగానికి వెళ్లనుండగా ఈ విషాదం చోటుచేసుకొంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో మృతిచెందిన చంద్రశేఖర్, గాయపడిన కూర్మినాయుడు

ఆమదాలవలస: పట్టణ సమీపంలోని శ్రీకాకుళం నుంచి పాలకొండ వెళ్లే సీఎస్పీ రహదారిలో పార్వతీశ్వరునిపేట జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. పాలకొండ నుంచి ఆమదాలవలస వైపు ఇద్దరు యువకులు బైక్‌పై వస్తున్నారు. ఇదే రహదారిలో శ్రీకాకుళం వైపు నుంచి పాలకొండ వైపు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. అయితే యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న వీరఘట్టం మండలం జె.గోపాలపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్(25) పడిపోగా బస్సు టైర్ ఆయన తలపైనుంచి వెళ్లడంతో ఘటన స్థలంలో మృతి చెందాడు. ఇదే బైక్‌ను డ్రైవింగ్ చేస్తున్న కూర్మినాయుడు తీవ్రంగా గాయపడడంతో పోలీసులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. వీరిద్దరూ ఆమదాలవలస పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పైపులైన్ పనుల్లో రోజు కూలీలుగా పనిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. డీజిల్ క్యాన్‌తో వారు చేసే పనివద్దకు డీజిల్ తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి ఆమదాలవలస, బూర్జ మండలాలకు చెందిన పోలీసులు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై ఆమదాలవలస ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు బుధవారమే కొత్తగా ప్రారంభించినట్లు సమాచారం. బస్సును ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వెనుక వీధిలో గురువారం ఓ యాచకురాలు మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదిఆంధ్ర వీధిలో నివాసముంటున్న లక్ష్మి అనే యాచకురాలు మద్యానికి బానిసై కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైంది. బుధవారం రాత్రి ఇందిరాగాంధీ జంక్షన్ వెనుక బాగంలో అయ్యప్పనగర్‌కు వెళ్లే దారిలో షాపు బయట పడుకుంది. గురువారం ఉదయం చూసేసరికి మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతిరాలి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

కాశీబుగ్గలో దొంగల హల్‌చల్

- 10 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు మాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గురువారం దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ చోరీకి తెగబడ్డారు. కాశీబుగ్గ అయ్యప్పస్వామి టెంపుల్ వీధిలో పలాస విద్యుత్ లైన్‌మెన్ తుంగాన ప్రభాకర్ ఇంటి తాళాలు పట్టపగలు పగలగొట్టిన దుండగులు లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు తెరిచి బీరువా సొరుగులోని రూ.1.50 లక్షల నగదు, 10 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. లైన్‌మెన్ ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లినట్లు బంధువులు తెలుపుతున్నారు. ఇంటి తాళాలు పగలగొట్టడాన్ని చూసి వారు షాక్ అయ్యారు. తక్షణమే స్థానికుల సహకారంతో కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ మోహనరావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. క్లూస్ టీమ్ చేరుకుని ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తూ, పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

చలో శ్రీకాకుళం విజయవంతం చేయండి

- ఎస్సీ ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోమ్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకుడు కల్లేపల్లి రాంగోపాల్, కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో–కన్వీనర్ కంఠ వేణు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఎస్సీలను వర్గీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యుత్సాహం చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మేధావులు గొంతెత్తుతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీ వర్గీకరణకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

వర్గీకరణతో అన్యాయం

వర్గీకరణ కారణంగా మాలలకి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అందువలన వర్గీకరణకి వ్యతిరేకంగా నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. దీనిలో భాగంగానే శ్రీకాకుళం వేదికగా ఎస్సీ వర్గీకరణకి వ్యతిరేకంగా భారీ ర్యాలీ, బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాతబస్టాండ్, కిన్నెర జంక్షన్, జెడ్పీ జంక్షన్, సంతోషిమాత కోవెల జంక్షన్ల మీదుగా ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నున్న డచ్ బిల్డింగ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ తర్వాతే డీఎస్సీ నియామకాలు జరుపుతామని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందని, అలా చేస్తే మాలలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాలు తక్షణం పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో రాయి వేణుగోపాల్, సాకేటి నాగరాజు, సింకు రమణ, దేబారిక రాజు, పెయ్యిల చంటి, అబ్బాస్, పంకు మురళీ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.